గాలిగోపురాలు నిర్మాణానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కవిటి : కవిటి బీచ్ రోడ్డులో దాతల సహకారంతో నిర్మాణం చేపడుతున్న శ్రీ కళ్యాణ వెంకటస్వారస్వామి ఆలయం గాలి గోపురాలు నిర్మాణానికి ఆదివారం దాతలు ఆర్థిక సహాయం అందించారు. ఉపాధ్యాయులు బాలక శ్రీనివాసరావు రూ.10 వేలు, తెప్పల రవి రూ.10 వేలు, గార రాంబాబు రూ.5016 వేలు, పోలీసు హెడ్కాన్స్టేబుల్ తామాడ ఉమా రూ.5 వేలు అందించారు. వారిని ఆయల అభివృద్ధి కమిటీ సభ్యులు సాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి.పి.రెడ్డి, ఆరంగి.మధు, పాండవ చంద్రశేఖర్, ఆరంగి కృష్ణారావు, మొగిలిపూరి సీతారాం, చంద్రయ్య,రామారావు,శ్రామణ్ కుమార్, రుద్రయ్యలు పాల్గొన్నారు.

'మొంథా' తుపానుపై అప్రమత్తంగా ఉండాలి : ఇన్ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : 'మొంథా' తుపాను ముప్పు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇన్ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. రేపు ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది.భారీ వర్షాలు నుండి అతి భారీ వర్షాలు కొన్ని చోట్లతో పాటు అత్యంత భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది .ఉరుములతో కూడిన మెరుపులు మరియు ఈదురు గాలులు 45 -55 కి.మీ గరిష్టముగా 65 కి.మీ వేగముతో వీచే అవకాశముంది. ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు చాలా చోట్ల కురిసే అవకాశముంది.భారీ వర్షాలు నుండి అతి భారీ వర్షాలు కొన్ని చోట్లతో పాటు అత్యంత భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది ఉరుములతో కూడిన మెరుపులు మరియు ఈదురు గాలులు 60-70 కి .మీ గరిష్టముగా 80 కి .మీ క్రమముగా 90-100 కి .మీ గరిష్టముగా 110 కి .మీ వేగముతో వీచే అవకాశముంది. ఈ తుపాను జిల్లాపై అక్టోబర్ 28 మరియు 29 తేదీల్లో తీవ్ర ప్రభావం చూపవచ్చని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఆయన జిల్లాలోని ఆయా శాఖల ఉన్నతాధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తుఫాను ప్రభావిత పరిస్థితిని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదే శించారు. ఈనెల 29 (బుధవారం) వరకు మత్స్యకారులు ఎవరూ సముద్రం లోనికి వేటకు వెళ్లరాదని, సముద్రం లోపల ఉన్నవారు వెంటనే తీరానికి చేరుకోవాలని, వరి పంట కోత దశలో ఉన్నట్లయితే, ఈ నాలుగు రోజులు కోతలు కోయరాదని, ఇప్పటికే వరి కోతలు జరిగి పొలాల్లో ఉన్న చేనును కల్లాలకు చేర్చడం లేదా వాటిని సంరక్షించే చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా, ప్రతీ మండల కేంద్రంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, కలెక్టరేట్‌లో 08942-240557 నంబరుతో కంట్రోల్ రూమ్ సిద్ధంగా ఉందని అన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం పొందూరు పుట్టుగ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తండ్రి, కొడుకులు దూగాన రామ్మూర్తి, ప్రణయ్లు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆదివారం కంచిలికి చెందిన ట్రూ హాండ్స్ సేవా ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణం రాజు, వరుణ్ మారుతి బ్రాంచ్ మేనేజర్ దాసరాజు, సింహాచలం, పురుషోత్తం, కేశవరావు, జగన్నాథ బెహరా, కిరణ్, వీరేష్ కృష్ణ, తాతయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర వైసీపీ కమిటీలో పలాస అసెంబ్లీకి ప్రాధాన్యత

విశాలాంధ్ర - పలాస-మందస : రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు విభాగాల్లో కీలక పదవులను పలాస అసెంబ్లీ నియోజకవర్గం చేజిక్కించుకుంది. మాజీ సీఎం వైఎస్ జగన్ పలాస అసెంబ్లీ ను ప్రత్యేకంగా గుర్తించి పార్టీ పదవులను ఇవ్వడం పట్ల నియోజకవర్గ పరిధిలో ఉన్న పార్టీ కమిటీలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు పై ప్రత్యేక అభిమానంతోనూ ఆయనను రాజకీయంగా మరింత ప్రోత్సహించేందుకు ఈ నియోజకవర్గంకు సంబంధించి కీలక నేతలకు పదవులను అప్పచెప్పారు. మందస ఎంపిపి డొక్కరి దానయ్య ను రాష్ట్ర పార్టీ బీసీ సెల్ విభాగం సహాయ కార్యదర్శి గాను నియమించారు. రాష్ట్ర బూత్ కమిటీ సహాయ కార్యదర్శిగా చింతాడ మాధవరావును పంచాయతీరాజ్ రాష్ట్ర విభాగం కార్యదర్శిగా పాలిన శ్రీనివాస్ రైతు విభాగం సహాయ కార్యదర్శిగా సాయి కృష్ణ ఉంగ ను నియమించారు రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సహాయ కార్యదర్శిగా సార ఢిల్లీ రావును రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫామ్ కార్యదర్శిగా మొదలవలస మన్మథరావును పబ్లిసిటీ జాయింట్ సెక్రటరీగా సురేంద్ర త్యాడిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. తమను పార్టీ గుర్తించి పదవులు ఇచ్చినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ కు మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మందస ఎంపిపి డొక్కరి దానయ్య మాట్లాడుతూ ఈ పదవులతో పార్టీ పట్ల మరింత బాధ్యత పెంచినట్టు అయిందని అన్నారు పార్టీని గ్రామస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపించడానికి తాను కృషి చేస్తానని ఆయన తెలిపారు.

హార్మోనియంను బహుకరించిన డా. పోతురాజు శ్రీధర్

విశాలాంధ్ర - హిరమండలం : రూ 30 వేలు రూపాయలు విలువ చేసే హార్మోనియం పెట్టెను ఆదివారం కోరాడ భజన బృందం సభ్యులకు హిరమండలం టీడీపీ పట్టణ అధ్యక్షులు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి డా.పోతురాజు శ్రీధర్ అందజేశారు. ఈ సందర్భంగా డా. శ్రీధర్ మాట్లాడుతూ భజన బృందం సభ్యులకు మంచి హార్మోనియం బాక్స్ ను అందించి భజనలను ప్రోత్సహించేందుకే అందజేశానని భజన కళాకారులకు మరింత ప్రోత్సాహం చేసేందుకే నని తెలిపారు. పెద్ద కోరాడ వీధి వరసిద్ధ వినాయక గుడి, పాతపట్నం అమ్మ వారి గుడికి, షిరిడీ సాయి గుడివద్ద భజనలకు భజన బృందం సభ్యులు వినియోగించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కామాక్షి స్వర్ణ కారులు సంఘము సభ్యులు భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళరాదు

ఎస్ఐ సింహాచలం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం గెద్దలపాడు సముద్రపు రేవులో మంథ తుఫాన్ పట్ల స్థానిక ఎస్సై వై. సింహాచలం మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. ఆదివారం ఆ గ్రామం వెళ్లి సముద్రపు వద్దన సమావేశం ఏర్పాటు చేశారు. వాయు గుండం ప్రభావంగా అలలు ఉధృతి పెరుగు తాయని, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలియజేశారు. వేటకు వెళ్ళారాదని హెచ్చరించారు. స్థానిక సర్పంచ్ శ్రీరంగం వీరస్వామి, ఎంపీటీసీ చింతల రాజులు, మాజీ సర్పంచ్ శ్రీరంగం రాజులు, మాజీ ఎంపిటిసి శ్రీరాంగం యర్రయ్య, స్థానిక మత్స్యకారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆమె చనిపోతూ ఐదుగురికి అవయవ దానం

విశాలాంధ్ర - సోంపేట : రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై కోమాలోకి వెళ్లిన ఓ మహిళ శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. ఈ పరిస్థితుల్లో కొంత మంది సూచన మేరకు కుటుంబ సభ్యులు ఆమె అవయువాలను ఇతరులకు మార్పిడి చేయడం ద్వారా వారి జీవితాల్లో వెలుగు నింపాలన్న ఉన్నతమైన ఆలోచనతో అవయువ దానానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. దీంతో ఆదివారం ఆసుపత్రి వర్గాలు ఆ మహిళ నుంచి అవయువాలను సేకరించి ఇతర ప్రాంతాలకు తగు జాగ్రత్తలతో పంపించారు. వివరాల్లోకి వెళితే సోంపేట మండలం మాకన్నపురం గ్రామానికి చెందిన ఉలాల హిమావతి (33) గత శుక్రవారం కొర్లాం నుంచి మాకన్నపురం గ్రామానికి వేరొకరి బైక్‌పై కూర్చుని వస్తుండగా మార్గమధ్యంలో బైక్‌పై నుంచి పొరపాటున జారిపడింది. దీంతో ఆమె తలకు దెబ్బ తగలడంతో కోమాలోకి వెళ్లిపోయింది. స్థానిక గ్రామీణ వైద్యులు పరిశీలించి వెంటనే పలాసలో గల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం వద్ద జెమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ గత రెండురోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు అవయువ దానానికి సిద్ధం కావడంతో ఆమె నుంచి కళ్ళు, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయంలను వైద్యులు సేకరించి తగు భద్రత ఏర్పాట్లు నడుమ అత్యవసరంగా సుదూర ప్రాంతాలకు పంపించారు. దీంతో హిమావతి మరణించి నప్పటికీ మరో ఐదుగురు కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు దోహదపడిందని పేర్కొంటున్నారు. ఆ కుటుంబం త్యాగాన్ని ఎవరూ మరువలేరని అనేక మంది ప్రశంసిస్తున్నారు. ఈమె భర్త వెంకటరావు ఒంగోలులో కర్రమిల్లులో పని చేస్తున్నారు. హిమావతి కూడా స్థానికంగా కూలి పనులు చేసుకుంటూ 7, 8 తరగతులు చదువుతున్న ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్నారు. ఇటువంటి నిరుపేద కుటుంబంలో ఆమె మృత్యువాత పడడం ఆ కుటుంబానికి తీరని లోటుగా చెప్పవచ్చు. ఆదివారం సాయంత్రం గ్రామంలో హిమావతి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎంపీ కేంద్ర మంత్రి రామ్మోహన్ కుమారుడు బారసాల వేడుకల్లో భామిడి

విశాలాంధ్ర - కొత్తూరు : కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కుమారుడు చిరంజీవి శివన్ ఎర్రం నాయుడు బారసాల వేడుకలు ఢిల్లీ అయన నివాసంలొ ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు కు ఆహ్వానం అందుకున్నజిల్లా ఎమ్మెల్యేలతో పాటు అతి కొద్ది మందిలొ కొత్తూరు మండలంకు చెందిన సామజిక వేత్త టీడీపీ యువ నేత భామిడి రాజు ఒకరు ఆయన పాతపట్నం ఏమ్మెల్యే మామిడి గోవిందా రావుతో ఢిల్లీలొ రామ్మోహన్నాయుడు కుమారుడు బారసాల ఫంక్షన్ కు హాజరు అయ్యారు సామజిక కార్యక్రమాల్లో మరో పక్క స్థానిక రాజకీయాల్లో చురుకుగా ఏమ్మెల్యే మామిడి అనుచరులుగా కొనసాగుతున్న భామిడి రాజు రాబోయే స్థానిక ఎన్నికల్లో మండల స్థాయిలొ కీలకమై పదవి కీ పోటీలో ఉంచాలి అన్న గట్టి దృక్పథంలొ ఏమ్మెల్యే మామిడి భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతుంది.

కేంద్ర మంత్రి బారసాల మహోత్సవంలో ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆదివారం ఢిల్లీలో కేంద్ర పౌర విమాన యాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు - శ్రావ్య దంపతుల కుమారుడు శివన్ ఎర్రంనాయుడు బారసాల మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని మరియు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వ్యక్తిగతంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తాత, తండ్రి వలే రాజకీయ, ప్రజా, సేవ రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించి వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ బారసాల వేడుక ఘనంగా నిర్వహించబడగా పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు మరియు స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి : సీఐ ప్రసాద్

విశాలాంధ్ర - కొత్తూరు : తుఫాన్ తో ముఖ్యంగా వంశధార నది తీరా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని కొత్తూరు పోలీస్ సిఐ చింతాడ ప్రసాద్‌రావు అన్నారు. తుఫాన్ ప్రభావంతో భారీ అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతా వరణ శాఖ హెచ్చిరించిన నేపథ్యంలో మండలంలో అతి లోతట్టు ప్రాంతం పెనుగటివాడ గ్రామంలొ సిఐ ప్రసాద్ పర్యటించారు ముందు జాగ్రత్తగా పంచాయతీ కేంద్రం మాతల గ్రామంలొ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తరలి రావాలి అని సిఐ ప్రసాద్‌రావు పెనుగటి వాడ గ్రామం ప్రజలును కోరారు.

నారాయణపురం కుడి కాలువలో గుర్రపు డెక్క తొలగింపు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని నారాయణపురం కుడి కాలువలో పలు చోట్ల సాగునీటి సరఫరాకు అడ్డంగా ఉన్న తూతిక బద్దు, గుర్రపు డెక్కను ఆదివారం తొలగించారు. దుప్పలవలస నీటిసంఘం అధ్యక్షుడు, మండల బీజేపీ అధ్యక్షుడు సనపల రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఇబ్రహీంబాద్, తోటపాలెం, కొత్తపేట, ముద్దాడ, పొన్నాడ తదితర గ్రామాల వద్ద కాలువలో ఉన్న అడ్డం కులను ప్రొక్లెయినర్ సాయంతో తొలగించారు. రైతులు, ఆయకట్టదారులు సహకరించారు.

మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేసి పేదలకు వైద్య విద్య దూరం చేశారు : ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర - కవిటి : మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేసి పేద, మధ్యతరగతి వారికి వైద్య విద్య దూరం చేశారని శ్రీకాకుళం నియోజక వర్గం స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం లండారి పుట్టుగ పంచాయతీ కొత్తపుట్టుగలో తన క్యాంపు కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి ప్రజా ఉద్యమానికి మద్దతు తెలపాలని కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు గత ప్రభుత్వం తీసుకు వచ్చినటువంటి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఎంతగానో ఉపయోగపడేవని, ఈ చంద్రబాబు ప్రభుత్వంలో వాటిని ప్రైవేటీకరణ చేసి పేద, మధ్య తరగతుల వారికి వైద్య విద్య దూరం చేశారని అన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, పేదవానికి వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ అనుబంధ విభాగాలకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు నర్తు శివాజీ, వైసిపి నాయకులు, పంచాయతీ ప్రముఖులు పాల్గొన్నారు.

అధ్యాపకులకై దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - మందస : మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల 2025-2026 విద్యా సంవత్సరంనకు గాను ఆంగ్ల (ఇంగ్లీష్)గెస్ట్ (అతిథి) అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తుల కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.తేజేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ సబ్జెక్టులో ఖాళీ ఉందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలన్నారు. ఒక సెట్ నకల పత్రాలు, ఫోటోలతో సహా బయోడేటా ను నేరుగా ఈనెల 29 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రభుత్వ జూనియర్ కళాశాల మందస కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇంటర్వ్యూ 31 వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలురు) శ్రీకాకుళం కార్యాలయంలో ఉంటాయని, ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని, విశ్రాంత ఆచార్యులు అధ్యాపకులు జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.

మోనింగి వారి చెరువు వద్ద శివలింగం ప్రతిష్ట

విశాలాంధ్ర - హిరమండలం : ఆదివారం మండలకేంద్రమైన హిర మండలం మేజర్ పంచాయతీ లోని పెద్ద కోరాడ జంక్షన్ నుంచి హిర మండలం పాత ఆర్టీసీ కంప్లెక్స్ వద్ద గల మోనింగి వారి చెరువు వరకు శివలింగం ను బాజా భజంత్రిలు భజనలతో ఊరేగింపుగా హిరతమండలం ప్రజలు చేరుకొని మోనింగి వారి చెరువు వద్ద శివలింగం ను ప్రతిష్ట చేశారుత. పాత బస్టాండ్ వద్ద ఉన్నటువంటి మోనింగ్ వారి చెరువు కొంతకాలంగా నిరుపయోగంగా ఉండేది ఇప్పుడు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ పోతురాజు శ్రీధర్ మరియు వారి బృందం మరియు శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం సభ్యులు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు బజరంగదళ్ బృందం వీరి అందరి సహకారము సౌజన్యంతో ఈ చెరువు అందుబాటులోకి తీసుకొని రావడం జరిగింది. అలాగే వీరందరి యొక్క సౌజన్యంతో చెరువు వద్ద ఉమా నీల కంటీశ్వరస్వర స్వామి వారి యొక్క శివలింగం ప్రతిష్ట చేశారు కావున భక్తులంతా కూడా విచ్చేసి స్వామివారిని దర్శించి నేడు అనగా కార్తీక మాసం మొదటి సోమవారం సాయంకాలం ఐదు గంటల 30 నిమిషాలకు గంగాహారతి స్వామివారి సన్నిధిలో ఇవ్వడం జరుగుతుందని ప్రతి ఒక్కరు కూడా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా శ్రీధర్ కోరారు. ఈ కార్యక్రమంలో హిరమండలం ప్రజలు పాల్గొన్నారు.

అంపశయ్య పై...ఉద్దానం.. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు శాపం..!

విశాలాంధ్ర - పలాస : కోనసీమను మరిపించే వాతావరణం ఇక్కడ స్వంతం... చుట్టూ సముద్ర తీరం.. మధ్యన ఉద్దానం(ఉద్యానవనం). అయినా ప్రతీ రోజూ ఏదో ఒక ప్రాంతంలో మరణ మృదంగం మ్రోగుతూ ఎవరో ఒకరు రోజూ ఉద్దానంలో అంపశయ్యపై ప్రయాణించవలసిందే. దీనికి కారణం ఈ ప్రాంతం ప్రజలు కిడ్నీ వ్యాధులతో అతలాకుతలం అవడమే. అప్పడప్పుడు ప్రభుత్వ అధికారులు, వైద్యులు పర్యటిస్తూ ప్రజలకు ఉపశమనం కలిగించే ప్రకటనలు చేసినా అవి కంటి తుడుపు చర్యలకే పరిమితం అవుతున్నాయి. పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట 'ప్రాంతాలను ఉద్దానంగా పిలుస్తుంటారు. ఇక్కడ ప్రజలు కొబ్బరి, జీడి మామిడి, పనస పంటలతో పాటు అంతర పంటలుగా మునగ, కాయగూరలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే మూడు దశాబ్దాలుగా అధిక సంఖ్యలో ఈ ప్రాంత ప్రజలు కిడ్నీ వ్యాధులతో మృత్యువాత పడుతూ పిట్టల్లా రాలిపోతున్నారు. ఇప్పటికే వేలాది మంది మృతి చెందగా వందలాది మంది ఈ వ్యాధి బారిన పడి వైద్యం చేయించుకోలేక మదనపడుతున్నారు. ఉద్దానంకే నేడు ఇది పరిమితం కాకుండా జిల్లా వ్యాప్తంగా ఈ కిడ్నీ వ్యాధి విస్తరించడం చూస్తుంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై వారికున్న భాద్యతను 'ఎంత వరకు నెరవేరుస్తున్నారో అర్థం అవుతుంది. ఒకప్పుడు ఏ ఒక్కరో కిడ్నీ వ్యాధితో మృతి చెందితే వింతగా భావించిన ప్రజలు నేడు వేలాది మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు మృత్యువాత పడుతుంటే చేసేది ఏమీ లేక తమ వంతు ఎప్పుడోనని ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు 30 ఏళ్ళ క్రితం నుంచి బావులలోని నీరు వాడేవారు. ఆ రోజుల్లో ఎటువంటి వ్యాధులకు గురికాలేదు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు బావులలో నీరు వాడవలసిన దుస్థితి ఏర్పడింది. మంచినీటి ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తున్నదని ప్రజలు, కాదని శాస్త్రవేతలు పూర్తి స్థాయిలో చెప్పలేకపోతున్నా దాని ప్రభావం కాదని ఒక సందేహన్ని వెలిబుచ్చారు. జీడి పంట అధిక దిగుబడికి సేంద్రియ చెరువుల కోసం ఆవుల మందలు తోటలలో వేసేవారు. నేడు రసాయనిక ఎరువులతో పాటు క్రిమిసంహారక మందులు వాడటం వలన వాటి అవశేషాలు భూమిలో చేరి అవి ప్రజలకు ప్రాణాంతకంగా తయారవుతున్నాయని, మేధావులు చెబుతున్నారు. వందలాది ఏకరాల జీడి తోటలకు ఏడాది పొడువునా పురుగుల మందులు వాడకం జరుగుతూనే ఉంటుంది. జీడి చెట్లకు కొట్టిన మందుల నుండి వెలువడే అవశేషాలు ప్రాణాలకు హాని కలిగించేవిగా తయారవుతున్నాయి. పురుగుల మందులు కొట్టిన వారు అధికంగా ఈ కిడ్నీ వ్యాధి బారిన పడుతుండగా, ఈ గాలి పీల్చిన వారు, ఆయా పరిసరాల్లో జీవనం సాగించిన వారికి ఇది అతి వేగంగా సోకుతుందని పలువురు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో పురుగులు మందులు కొట్టిన పలువురు రైతులు అధికంగా మృతి చెందడమే కారణంగా చెప్పుకోవచ్చని అంటున్నారు. అటు తరువాత వారికి సహకరించిన వారు కూడా మృత్యువాత పడుతున్నారు. గతంలో మంచినీరు, ఉప్పు చేపలు, చివరకు మునగ కాయలు అధికంగా తినడం వల్ల కూడా ఈ వ్యాధి సోకుతుందనే స్థాయికి శాస్త్రవేతలు చెప్పుకోవడం విశేషం. ఏ ఇంటిలో చూసినా నేడు కిడ్నీ వ్యాధిగ్రస్తులు కన్పిస్తున్నారు. ఎన్నో సార్లు అమెరికా, నెదర్లాండ్, హైదరాబాద్, విశాఖల నుండి పలువురు శాస్త్రవేత్తలు వైద్య నిపుణులు వచ్చి ఈ ప్రాంతంలో పరీక్షలు నిర్వహించినా సరైన కారణం చెప్పలేకపోతున్నారు. ఇప్పటికీ ఈ ప్రాంతం నుండి మంచినీటి నమూనాలు, రక్త నమూనాలు సేకరణ చేస్తున్నారు తప్పా వ్యాధి సోకిన కారణాలు బయటపెట్టలేక పోతున్నారు. ఈ వ్యాధి బారిన పడిన కొన్ని గ్రామాల ప్రజలు కుటుంబాలతో వలసలు పోయి బ్రతుకు జీవుడా అంటూ ఇతర రాష్ట్రాలలో నివాసముంటూ అప్పుడప్పుడు స్వగ్రామాలను సందర్శించుకొని వెళ్తున్నారంటే వ్యాధి తీవ్రత ఎంతగా ఉందో స్పష్టమౌతోంది. పలాస ప్రాంతంలోని గురుదాసుపురం, గొల్ల మాకన్నపల్లి, మెట్టూరు, గునుపల్లి, బైపల్లి బాతుపురం, నువ్వలరేవు, దేవునల్తాడ, ఉద్దానం రామకృష్ణాపురం, బేతాళపురం, అంబుగాం, బహడపల్లి, లోహరిబంద, సువర్ణపురం, రాంపురం తదితర గ్రామాలలో అధికంగా ప్రజలు ఈ వ్యాధి బారిన పడి మృతి చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో 6 ఏళ్ళపాటు పురుగుల మందులు నిషేదిస్తే ఈ వ్యాధి తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని పలువురు చెబుతున్నారు. 30 ఏళ్ళ క్రితం ఈ వ్యాధి బారిన పడిన వారి వివరాలు, నేటి పరిస్థితి, 5 ఏళ్ళ తరువాత ఒకసారి పరిస్థితిని పరిశీలిస్తే తేడా స్పష్టం కాగలదని ఈ ప్రాంతీయులు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటే కొంత మేరకు ప్రజలకు ప్రాణాదానం చేసిన వారవుతారని పలువురు భావిస్తున్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులు విజృంభన పెరగడంతో ప్రజలు మినరల్ వాటర్, వాడేందుకు దృష్టి సారించారు. జిల్లాలోని పలు గ్రామాలలో ఇప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన.. సొంతంగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని చాలా గ్రామాలలోని ప్రజలు వీటినే వాడకం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఈ ప్రాంత కిడ్నీ రోగులు దయాలసిస్ చేసుకునేందుకు పడుతున్న బాధలను గమనించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రంతోపాటు ఆసుపత్రిని నెలకొల్పడంతో కిడ్నీ రోగులకు కొంత ఊరట కలిగించింది. అంతేకాకుండా కిడ్నీ రోగులకు పదివేల రూపాయలు పెన్షన్ కూడా మంజూరు చేసి ఆదుకుంది వైసిపి ప్రభుత్వం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కిడ్నీ రోగులను ఆదుకునేందుకు దూకుడు పెంచింది. పలాస ఎమ్మెల్యే శిరీష సారథ్యంలో కిడ్నీ ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కిడ్నీ ఆసుపత్రిలో ఉన్న దయాలసిస్ పరికరాలకు తోడు ప్రవాసాంధ్రుల సహకారంతో మరికొన్ని దయాలసిస్ పరికరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ మహమ్మరి మూలాలు కనుగొనేందుకు అనేక కోణాల్లో ఆలోచిస్తున్న..కనుగొనడమే ఆలస్యం అవుతోంది.. కిడ్నీ రోగులకు శాపంగా మారింది.

హిందీ భాష పరీక్షలతో మేలు

విశాలాంధ్ర - కవిటి : హిందీ ప్రచార సభ హైదరాబాద్, దక్షిణ భారత హిందీ ప్రచార సభ మద్రాస్ వారి పరీక్షలతో విద్యార్థులకు మేలు చేకూరుతుందని భాషా ప్రచా రకులు నిరంజన్ కడంగా అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎస్విజె విద్యాసంస్థలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భాషా పరీక్షలపై అవగాహన కల్పించారు. అలాగే పదివ తరగతి చదువుతున్న విద్యార్థులకు వ్యాకరణాంశాలు, ముఖ్యప్రశ్నలపై శిక్షణ ఇచ్చి సులభరీతిలో పరీక్షలు రాసే విధంగా ఉత్సాహపరిచి హిందీ భాష పట్ల భయాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో భాషా ఉపాధ్యాయులు పార్వతి, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి ఆటోలో నాటుసారా రవాణా

ముగ్గురు వ్యక్తులు అరెస్ట్, ఆటో సీజ్

విశాలాంధ్ర - సోంపేట : ఒడిశా ప్రాంతం నుంచి అక్రమంగా నాటుసారాను ఆటోలో తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను సోంపేట ఎక్సైజ్ సీఐ జీ.వీ.రమణ అరెస్ట్ చేశారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు నాటుసారా అక్రమ రవాణాపై తమకు సమాచారం రావడంతో కొద్ది రోజులుగా ఒడిశా సరిహద్దులపై నిఘా పెట్టారు. ఆదివారం ఉదయం సీఐ రమణ, సిబ్బంది కలిసి ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా వేయడంతో ఒరిస్సా వైపు నుంచి మందస మండలం దేవుపురం జంక్షన్ వద్ద ఆటోపై అనుమానంతో పరిశీలించగా అందులో ప్లాస్టిక్ గోనెసంచుల్లో 50లీటర్ల నాటుసారా గమనించి వెంటనే స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తరలిస్తున్న పిడి మందస గ్రామానికి చెందిన కడ్డాల రాజారావు, ఇప్పిలి ఉమామహేష్, అగ్గున నారాయణరావులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఆటోను కూడా సీజ్ చేశారు. నిందితులను సోంపేట మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రిమాండ్ విధించారు సిబ్బంది గుణాకర్, భానుప్రసాద్‌లను ఈ సందర్భంగా అభినందించారు. ఈ దాడుల్లో సీఐ జీవీ రమణతో పాటు ఎస్సై జగన్నాథ్, గుణాకర్, మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నివగాం వంతెనపై వెలిగిన విద్యుత్ దీపాలు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - కొత్తూరు : వంశధార నది నివగాం మాతల గ్రామాల వంశధార నది పై ఉన్న వంతెన పై గత కొంత కాలంగా విద్యుత్ దీపాలు వెలగని సమస్యను ఇటీవల విశాలాంధ్ర ఒక వార్త ప్రచురించింది. దీంతో ఈ వంతెన పరిధిలోకి వచ్చిన నివగాం పంచాయతీ పాలకులు స్పందించారు వంతెన పై పూర్తి స్థాయి లైట్లు ఏర్పాటు చేసారు.

ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తాను

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం పొందూరు పుట్టుగలో తండ్రి, కొడుకులు, రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వడ్డిపుట్టుగలో బిసాయి. దుర్యోధన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయా కుటుంబాలను ఆదివారం జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల. రాజేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పెద్దలతో మాట్లాడి పార్టీ నుంచి ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు వెంకటేష్, ఆర్. కృష్ణయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులు పని ద్వారానే గుర్తింపు తెచ్చుకోవాలి

ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సాంబమూర్తి

విశాలాంధ్ర - పలాస : వ్యాయామ ఉపాధ్యాయులు వారి పని తీరుతోనే గుర్తింపు తెచ్చుకోవాలని ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం సాంబమూర్తి అన్నారు. ఆదివారం పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు టీ తవిటయ్య అధ్యక్షతన డివిజనల్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కొత్తగా నియమితులైన వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు వృత్తి పరమైన నియమ నిబంధనలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం విద్య ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పాఠశాలలో నెలకొల్పడానికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులలో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు, క్రమశిక్షణ అలవర్చుకునేందుకు వ్యాయామ ఉపాధ్యాయుడు కృషి ఎంతగానో అవసరమన్నారు. అనంతరం సుదీర్ఘ కాలం వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘానికి వివిధ స్థాయిల్లో సేవలందించిన విశ్రాంత వ్యాయామ విద్య ఉపాధ్యాయులు మెంటాడ సాంబమూర్తి దంపతులకు జోనల్ స్థాయి వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో అతిథిగా హాజరైన రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సహాధ్యక్షుడు యెన్ని శేఖర్ బాబు మాట్లాడుతూ వృత్తిపరమైన అంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే మండలం నుండి జిల్లా స్థాయి వరకు వివిధ స్థాయిలో మన యంత్రాంగాన్ని ఉపయోగించుకొని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. వృత్తిలో మంచి ఫలితాలు సాధించాలని అదే మీకు భవిష్యత్తులో సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపు రావడానికి దోహదపడుతుందన్నారు. జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ సలహాదారు కె.రాజారావు మాట్లాడుతూ 2000 తర్వాత వృత్తిలో చాలా ఒత్తిడి పెరిగి నప్పటికీ మన కార్యక్రమాల్ని విస్తృతం చేశామే తప్ప వెనకడుగు వేయలేదని అప్పటి వ్యక్తులను ఆ కార్యక్రమాల్ని స్ఫూర్తిగా తీసుకొని మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.పద్మనాభరెడ్డి, వి. గజేంద్రరావు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. రామారావు జిల్లా అదనపు కార్యదర్శి సిహెచ్. పద్మలోచనం టెక్కలి జోన్ సెక్రెటరీ కె.ప్రకాష్‌రావు టెక్కలి నియోజకవర్గం ఎస్జీఎఫ్ సమన్వయకర్త ఎన్. రమేష్ జిల్లా గ్రిక్స్ కార్యదర్శి టి. శ్రీనివాస్ రావు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.హరిబాబు పలాస మండల ఎస్.జి.ఎఫ్ సమన్వయకర్త ఎస్. చంద్రశేఖర్ ఒకటో జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు జి .లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం కె.కపాసుకుద్ది గ్రామంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రవివర్మ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పేకాట ఆడుతున్న నలుగురుతో పాటు వారి వద్దనున్న రూ.2010లు స్వాధీనం చేసుకుని వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తుపాన్‌పై గ్రామాల్లో అధికారుల హెచ్చరికలు

విశాలాంధ్ర - సోంపేట : మొంతా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోంపేట సీఐ మంగరాజు, బారువ ఎస్సై హరిబాబునాయుడు, రెవెన్యూ సిబ్బంది కలిసి మండలంలోని తీరగ్రామాలను ఆదివారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో మత్స్యకారులతో అధికారులు మాట్లాడి సోమవారం నుంచి భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోను సముద్రపు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. అలాగే అనవసరంగా బయట తిరగవద్దని, ఇళ్లల్లో ఉండాలని సూచించారు. ఈదురు గాలులకు చెట్లు మొదలైనవి విరిగిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైతే సమీపంలో గల రక్షిత భవనాల్లోకి వెళ్లాలని సూచించారు.

ఘనంగా కార్తిక మాసం పూజలు

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామంలో కార్తిక మాసం సందర్భంగా గ్రామస్తులు వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉసిరికి చెట్టుకు ప్రియా కృష్ణారావు, సుశీల దంపతుల ఆధ్వర్యంలో చిన్నజీయర్ స్వామి శిష్యులు బి.శాంతారామ్ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

'డా.మాదిన' కు రైతు నేస్తం పురస్కార ప్రదానం

భారత మాజీ ఉప రాష్ట్రపతి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రి చేతుల మీదుగా బహుకరణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : పశు సంవర్ధక శాఖలో 31 సంవత్సరాలుగా అందించిన అత్యున్నత సేవలకు గుర్తింపుగా డా. మాదిన ప్రసాదరావుకు "రైతు నేస్తం" పురస్కారాన్ని భారత పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రదానం చేశారు. హైదరాబాద్ స్వర్ణ భారతి ట్రస్ట్‌లో రైతునేస్తం మరియు ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో వినూత్న సేవలు అందించే శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, ఆదర్శ రైతులకు ఇచ్చే అవార్డుల ప్రధానోత్సవ వేడుకలు వైభవంగా నిర్వ హించారు. 22 సంవత్సరాలు పశు వైద్యునిగా శ్రీకాకుళం జిల్లాలో రూరల్ మండలాలలో మూగ జీవా లకు వైద్య సేవలు అందించారు. టెక్కలి డివిజన్ లో అనేక గ్రామాలలో పాల సేకరణ కేంద్రా లను ఏర్పాటు చేయడంలో ముఖ్య భూమిక పోషించారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో డా. మాదిన పనిచేసిన ప్రతీ పశు వైద్య కేంద్రానికి శాశ్వత భవనాలు సమకూర్చడంలో విశేష కృషి చేసి సఫలం అయ్యారు. శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రిలో సహాయ సంచాలకునిగా 5 సంవత్సరాలు సేవలు అందించి, ప్రస్తుతం విశాఖపట్నం జిల్లాలో పలు పథకాలకు సమర్థమైన నోడల్ అధికారిగా గుర్తింపు పొందారు.

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక రద్దు

జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : నేడు(సోమవారం) నిర్వహించవలసిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక కార్య క్రమము రద్దు చేసినట్లు జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున ప్రజలు ఎవరు కార్య క్రమానికి రారాదని కోరారు. అధికారులు మొంథా తుఫాన్ సన్నాహక కార్యక్రమాల్లో పాల్గొనవలసి యున్నందున ప్రతి సోమవారము జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే అర్జీల స్వీకరణ కార్యక్రమము, అలాగే మండల కేంద్రాలలో జరిగే ఈ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు తెలియజేశారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

నేటితో ముగియనున్న క్విస్కిట్ పాల్ ఫెస్ట్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్లో ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తున్న క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్–2025 సోమవారంతో ముగియనుంది. నేషనల్ క్వాంటమ్ మిషన్ లో భాగంగా ఐబీఎం క్వాంటమ్ సహకారంతో ఈ ఫెస్ట్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. 6వ రోజైన ఆదివారం క్వాంటమ్ రీసెర్చ్ సైంటిస్ట్ (న్యూయార్క్) డాక్టర్ రితజిత్ ముజుందార్ మాట్లాడుతూ క్వాంటమ్ ద్వారా అనేక మార్పులు తీసుకురాగలమని చెప్పారు. అలాగే క్వాంటమ్ అల్గోరిథమ్స్పై అవగాహన కల్పించారు. క్వాంటమ్ సూత్రాల ప్రయోగాత్మక అన్వయాలు, భవిష్యత్లో సాంకేతిక రంగంలో వాటి పాత్ర అనే విషయాలను వివరించారు. డేటా టెక్ సీఈవో డాక్టర్ జ్ఞాన్ ఎల్లా, శ్రీనివాస పీసుపాటి, క్వాంటమ్ కంప్యూటింగ్ ఇంజనీర్ తిలోక్ సాధుఖాన్ ఆధ్వర్యంలో హ్యాకథాన్ నిర్వహించారు. పలువురు విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో క్వాంటమ్ సమస్యలపై పరిష్కారాలను ప్రదర్శిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, పరిపాలనాధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, కోఆర్డినేటర్లు డాక్టర్ రవి, సీఎస్ఈ విభాగాధిపతి రమేష్ తదితరలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోండి..కాంట్రాక్ట్ డిగ్రీ కళాశాల లెక్చరర్ల సంఘం

విశాలాంధ్ర - ఆమదాలవలస : కాంట్రాక్ట్ లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ పై వస్తున్న అసత్య ప్రచారాలను ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ డిగ్రీ కళాశాలల లెక్చ రర్ సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు. క్రమబ ద్ధీకరణ అడ్డుకునే విధంగా కొంతమంది ఒప్పంద అధ్యాపకులపై దుష్ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. ఆదివారం కాంట్రాక్ట్ లెక్చరర్ల ప్రాథమిక సభ్యులు నా యకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెన్ మైదానంలో సమావేశమై ఓర్వ లేనితనం తో అవాస్తవాలను ప్రచా రం చేస్తూ తమ రెగ్యులరైజేషన్ను అడ్డుకునే ప్రయత్నా లు చేస్తున్నారని ఆవేదన చెందారు. రాష్ట్రంలో ని కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరినీ క్రమబద్ధీకరణ చేయాలని సమస్యలను ప్రజా ప్రతినిధులకు విన్నవించుకుంటున్న తరుణంలో మరో ప్రక్క కొంతమంది ఓర్వ లేనితనముతో క్రమబద్ధీకరణను అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు అని అన్నారు. ఇందులో భాగంగానే డబ్బులు వసూలు చేస్తున్నట్లు అసత్య ప్రచారం చేస్తూ ఈ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారని అన్నారు. అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఒప్పంద అధ్యాపకుల సంఘాల ప్రాథమిక సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. రెగ్యులరైజేషన్ కోసం మేము చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు కొంత మంది కుటిల రాజనీతిని ప్రదర్శిస్తున్నారని దీనిని ఏ ఒక్కరూ విశ్వసించ రాదన్నారు. 2000 సంవత్సరం నుండి నేటికీ 25 సంవత్సరాల గా ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలని సుప్రీం ధర్మాసనం ఆదేశాలు వెలువరించిన సంగతి గుర్తు చేశారు. గత ప్రభుత్వం 10,119 పోస్టులు రెగ్యులరిజేషన్కు యాక్ట్ 30 ప్రకారం జీవో నెంబరు 114ను విడుదల చేసింది. అప్పటికి 3500 రెగ్యులర్ అయ్యారు. మిగిలిన వారి విషయానికి వచ్చేసరికి ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో ఆర్డర్ కాపీలు నిలిచిపోయాయి. మా పరిస్థితులను ప్రభుత్వ పెద్ద లకు విన్నవించడం తో మాకు న్యాయం చేయాలని చూస్తుంటే దాన్ని అడ్డుకునేందుకు కొంతమంది వ్యక్తులు ఇలాంటి చర్యలు పాల్పడుతూ తమ నోట్లో మట్టి కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు అని ఆరోపించారు అని ఆరోపించారు. తమ ఉద్యోగ అంశాలపై వస్తున్న అస త్య ప్రచారాలు ను ఖండించిన వారిలో జి రామకృష్ణ జిడిసి ఉమెన్ శ్రీకాకుళం,ఆర్ వెంకటేశ్వర్లు జిడిసి మెన్, డాక్టర్ కోన వాసుదేవరావు అర్థశాస్త్ర జిడిసి మెన్, శ్రీకాకుళం పి.రామారావు, ఎన్.శంకర బాబు జిడిసి పాలకొండ, వి.అచ్యుతరావు జిడిసి తొగరం, సిహెచ్ రాంబాబు జిడిసి టెక్కలి, టి.త్రినాధ జీడీసీ నరసన్నపేట, పి.తారకేశ్వరరావు జిడిసి పలాస, పి.సంతోష్ జిడిసి ఇచ్ఛాపురం, ఎం.మాధురి జిడిసి.పొందూరు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు ప్రజారోగ్య వ్యవస్థ కొనసాగాలి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : "పిపిపి విధానంలో మెడికల్ కళాశాలలు" అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గొంటి గిరిధర్ అధ్యక్షతన జరిగింది. రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల నాయకులు మేధావులు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 లో జీవించే హక్కు కల్పించబడిందని, అందులో భాగంగా దేశంలోని ప్రతీ పౌరుడు ప్రభుత్వం ద్వారా వైద్యము పొందవచ్చు అన్నారు. ప్రభుత్వం నిర్మించి నిర్వహించాల్సిన 10 ప్రభుత్వ వైద్య కళాశాలలో జీవో 590 తో పిపిపి విధానంలోకి మార్చడం ప్రజల హక్కులను కాలరాయడమేనని తెలిపారు. ఈ వైద్య కళాశాలల్లో వైద్య విద్యను పొందడమే కాకుండా ప్రతి కళాశాలకు అను బంధంగా 420 పడకల ఆసుపత్రి అందు బాటులో ఉండడంతో ఆయా ప్రాంతాలలోని పేద మధ్యతరగతి ప్రజలు ఉచిత వైద్య సదుపాయాలు పొందవచ్చని తెలిపారు. కానీ వైద్య కళాశాలలు ఆసుపత్రులు ప్రైవేటీకరణ వలన ఈ అవకాశాన్ని పేద ప్రజలు కోల్పోతారన్నారు.

ప్రజల ఆరోగ్య హక్కులను పేద ప్రజల వైద్యానికి హామీ ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే సాధ్యమవుతుందని, గతంలో మంజూరైన 17 వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరించే చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. వైద్య విద్యను ఆరోగ్యాన్ని అంగడి సరుకుగా మార్చే ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని 10 వైద్య కళాశాల నిర్మాణ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జిడిపిలో ఐదు శాతం వైద్య రంగానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల రక్షణకు జెవీవీ చేస్తున్న కృషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఐజేయు నాయకులు నల్లి ధర్మారావు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ కే శ్రీనివాస్ (ప్రజారోగ్య వేదిక), కుప్పిలి కామేశ్వరరావు, (జెవివి) పేకల తేజేశ్వరరావు సిఐటియు, బమ్మిడి శ్రీరామ్మూర్తి యూటీఎఫ్, కే శ్రీనివాస్ సాహితీ స్రవంతి, బలివాడ ధనుంజయ రావు ఎల్ఎఫ్ఎల్ హెచ్ ఎంఎస్, బోనెల రమేష్ ఏపీ ఎస్సీ ఎస్టీ యూఎస్, బొడ్డేపల్లి మోహనరావు ఐలు, మిస్కా కృష్ణయ్య కే ఎన్ పి ఎస్,సిహెచ్ శ్రీనివాస్, రామ్మోహన్ ఏపీటీఎఫ్ 257, బి.వెంకటేశ్వర్లు ఏపీటీఎఫ్ 1938, కింజరావు నూకరాజు ఎస్సీ ఎస్టీ టీఎఫ్, రమేష్ బాబు బిటిఏ, పి.మోహనరావు జన సాహితీ, ఎం.రామ్మోహనరావు ప్రైవేటు విద్యా సంస్థలు, ఆర్ చిన్నారావు రిమ్స్, భాస్కరరావు సిపిఎస్ యుఎస్, డాక్టర్ కే ఉదయ్ కిరణ్ బి.ఆర్ ఎ యు, గణపతి పోస్టల్, గణేష్ దళిత ఐక్యవేదిక, బీ ధనలక్ష్మి యుటిఎఫ్, తంగి ఎర్రమ్మ రచయిత, కే.గణపతి, ఎం.గోవర్ధన రావు పట్టణ పౌర సంక్షేమ సంఘం, రౌతు శంకరరావు వైఎస్సార్టిఎఫ్, పి.సుధాకర్ బాబు, బి జగన్నాథరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కొత్తకోట అప్పారావు, బొడ్డేపల్లి మోహనరావు, ఎం పద్మనాభరావు, పాలవలస ధర్మారావు, పాలకొండ కూర్మారావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, పేడాడ వేదవతి, హెచ్ మన్మధరావు, బి.ఉమా మహేశ్వరరావులు చర్చల్లో పాల్గొని మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రజారోగ్య సంస్థలను కాపాడుకోవడానికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్య బీమా వర్తించక మరణ మృదంగం

- ఆప్కాస్ ఉద్యోగుల వెతలు - చిరుద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి
- వేతనాలు అంతంత మాత్రమే - తక్షణ వైద్యం అందక మృత్యువాత
- తామే భారమయ్యామా అంటూ వేదన

విశాలాంధ్ర - ఆమదాలవలస : పని చేస్తున్నది ప్రభుత్వ కొలువులో కానీ అర కొర వేతనాలు అయినా ప్రభుత్వ ఉద్యోగులం. కనీస ప్రభుత్వ రాయితీలు లేని జీవితాలకు భరోసా లేని అంతకుమించి ఆరోగ్య భీమా లేని బ్రతుకులుగా మారాయి. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఎల్జీఎస్, ఎంటిఎస్, ఉద్యోగులుగా కొలువుదీరినప్పటికీ ఆరోగ్యంపై ధీమాలేని బ్రతుకులుగా మారాయని పలువురు ఆ ప్కాస్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి కనీసం వైద్య సదుపాయాల అందక ప్రైవే ట్ ఆసుపత్రుల కోరిన ధనాన్ని అందించలేక వారి జీవి తాలకు వారే మరణ శాసనం రాసుకుంటున్నారు. దారి ద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి అందిస్తున్న ఆరోగ్యశ్రీ ప్రభుత్వ పథకాలైన రేషన్ వంటి వాటిని కూడా ప్రభు త్వం అందించడం లేదు. పేరుకే ఉద్యోగం అయినా పేదరికమే వెంటాడుతుంది. వేతన సవరణ చట్టాలను అనుసరించి జీతాలు అందించాలని యూనియన్ల ద్వారా కోరినప్పటికీ ఫలితాలు అంతంత మాత్రమే ఉన్నాయని వారు ఆవేశ ఆందోళనలో ఉన్నారు. ప్రధా నంగా సృష్టి చేస్తే కనీస వైద్య సదుపాయాలు అందిం చలేని ప్రభుత్వ కొలువులు అయ్యాయని మరణించిన వారి కుటుంబాలు రోదిస్తున్నాయి. ఆరోగ్య భీమా వర్తించక ప్రైవేటు ఆసుపత్రిల లో బిల్లులు చెల్లించలేక చివరకు మృత్యువాత చెందాల్సిన దుస్థితి వస్తుంది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మునిసిపల్ ఎంటిఎస్ ఉద్యోగి పేడాడ ధనుంజయ్ రావు ను ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతూ పరి స్థితి విషమంచటంతో విశాఖపట్నం అపోలో ఆసుప త్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన జీవితానికి ధీమా లభించలేదు. ఐసిడిఎస్ పరిధి అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త సీపన కృష్ణవేణి గుం డెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యశ్రీ వర్తిం చకపోవడంతో ఆపరేషన్కు కావలసిన మొత్తాన్ని సర్దుబాటు చేసే సమయంలోనే ఆస్పత్రి బెడ్ మీద మృ తి చెందారు. ఇలా చాలీచాలని జీతాలు తో పేదరికా న్ని మోస్తూ చికిత్సకు సరిపడా మొత్తాలు చెల్లించలేక ఎవరికి వారు మృత్యువాత పడుతున్నారు. అక్టోబర్ నెలలో ఇరువురు చిరు ఉద్యోగులు సరైన సమయం లో చికిత్స అందక మృత్యువాత పడ్డారు.

ఆప్కాస్ ఉద్యోగుల వెతలు...

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఉద్యోగులను గత ప్రభుత్వం ఆప్కాస్ చేర్చింది. ఆప్కాస్ లో చేర్చ డం వల్ల వీరికి ప్రభుత్వం నుంచి అందే ఎటువంటి రాయితీలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం తొలగించింది. ఉద్యోగరీత్యా ఆధార్ అనుసంధానం కావడం తో వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. అలా అని అరకొర జీతాలు ప్రభుత్వం నుంచే ఉద్యో గుల అందించే ఈఎస్ఐ గాని ఇతర అలమనుసులు గాని లేవు. ఆముదాలవలస పురపాలక సంఘంలో ఎన్ ఎం ఆర్ ఉద్యోగులుగా చేరి ఎప్పటికీ ఎం టి ఎస్ ఉద్యోగులుగా మార్పు చెందారే తప్ప ప్రభుత్వ పథ కాలు ఏవి వారికి అందటం లేదు. అంతేకాకుండా వారి వయస్సు నిండిపోతే రిటైరై వెళ్లిపోవడమే. కనీసం వారు దాచుకున్న మొత్తం కూడా ఒక్క రూపాయి కూడా అందదు. నగర పంచాయతీగా ఏర్పడిన నాటి నుంచి ఎం టి ఎస్ ఉద్యోగులుగా 45 మంది చేరారు. కొంతమంది పదవీ విరమణ చేశారు. 16 మంది అర్ధాంతరంగా అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తు తం 14 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లోనూ, ఇరిగేషన్ లోను, ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలోనూ ఆప్కాస్ లో పనిచేస్తున్నవారు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఆప్కాస్ ఉద్యోగులకి ఆప్కాస్ ఉద్యోగులకి ప్రభుత్వం ఆరోగ్య భీమా(ధీమా) కల్పించకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. పదవీ విరమణ చేసిన, అనారోగ్యంతో కానీ అకాల మరణం కానీ సంభవించినప్పటికీ వారికి ఎటువంటి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందవు. కనీసం తోటి సహుద్యోగులు కూడా వారికి సంతాపం తెలిపే పాపాన పోవడం లేదు. నాలుగు రోజులు కలిసి జీవిస్తే వారికి ఏదైనా సంభవిస్తే అయ్యో పాపం అంటాం కానీ ఈ ఉద్యోగుల్లో మాత్రం కలసి మెలసి ఉద్యోగం చేసిన ప్పటికీ వారికి ఏదైనా అనుకోనిది సంభవిస్తే పలకరిం చిన పాపాన కూడా పోవడం లేదు. అంటే ఈ ఉద్యోగు ల బ్రతుకులు అర్ధాంతరంగా ముగియాల్సిందేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మేమే భారమయ్యామా అంటూ వారి కుటుంబాలు రోదిస్తున్నారు. కుటుంబా న్ని పోషించే వ్యక్తి ఉద్యోగం చేస్తున్నాడు అన్న ధీమా తో ఉన్న వారి కుటుంబ సభ్యులకు వారు దూరమైన తర్వాత కనీస ప్రభుత్వ సహాయం అందక బోరున విలపిస్తున్నారు.

తక్షణ వైద్యం అందక మృత్యువాత...

ఉద్యోగులకు ప్రమాదం జరిగిన సమయంలో తక్షణ వైద్య సదుపాయాల అందక మృత్యువాత పడుతు న్నారు. మరి కొంతమంది వైకల్యంతో బాధపడుతూ మూల చేరిపోతున్నారు. ఉద్యోగులుగా ఎటువంటి ధీమా లేకపోవడంతో వారి బ్రతుకులు అగమ్య గోచరంగా మారాయి. మున్సిపాలిటీ లో పనిచేస్తున్న మోహనరావు అనే ఎలక్ట్రికల్ ఉద్యోగి విద్యుత్ లైట్లు వేస్తుండగా స్తంభం పైనుంచి జారిపడ్డారు. ఆయనకు ప్రభుత్వ వైద్య సేవలు అందలేదు. వారి కుటుంబ సభ్యులు ఆపరేషన్ అయిన ఖర్చులు కొంత మొత్తాన్ని చెల్లించి ఆపరేషన్ చేయించారు. ఆయన పరిస్థితి ప్రస్తుతం ప్రమాదకరం కాకపోయినప్పటికీ వైకల్యంతో జీవించాలి. మరి ఆ కుటుంబానికి భరోసా ఏముంది అని ఆవేదన చెందుతున్నారు. తక్షణ వైద్య సౌక ర్యాలు అందక ఎల్జి ఎస్ ఉద్యోగులు 16 మంది మృతి చెందారు. అందులో ఉదాహరణగా గురుగుబెల్లి శ్రీని వాసరావు వైద్య సౌకర్యం అందక మృతి చెందారు. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి ఏ రకమైన ఆర్థిక భరోసా అందలేదు. తిమ్మాపురంలో తిమ్మాపురం లో విధి నిర్వహణలో పన్నులు వసూలు చేస్తుండగా దుంపల సత్యం గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు వైద్య సదుపాయం అందలేదు సరి కదా కుటుంబానికి ఏ రకమైన ప్రభుత్వం నుంచి ఆర్థిక భరోసా చేకూరలేదు. ఏవి రమణ, కల్లేపల్లి రాజు, ఏ నారాయణరావు, కల్లేపల్లి అప్పారావు, జి.ఎర్రయ్య, వమరవెల్లి తిరుపతి, జి అమ్మడు, కల్లేపల్లి కృష్ణ లక్ష్మణ తదితరులు వైద్య సదుపాయాలు అందక చెందినప్పటికీ వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఏ రకమైన సహాయ సహకారాలు అందకపోవడంతో ఆ కుటుంబాలు రోధనలు మిన్నంటాయి. చిరుద్యో గులకు కనీసం ప్రభుత్వం ఆరోగ్య రక్ష కల్పించకపోవ డంతో మృత్యువాత పడ్డారు. ఆముదాలవలస మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ సెక్షన్ లో 43 మంది శానిటేషన్ లో 71 మంది పనులు చేస్తున్నారు. వీరిలో కూడా కొంతమంది మృతి చెందారు. అయినప్పటికి వారి స్థానంలో కొత్త వారితో భర్తీ చేస్తున్నారు. వారికి కూడా ఎటువంటి సౌకర్యాలు లేవు అని వారు ఆవే దన చెందుతున్నారు. అలాగే ప్రభుత్వాలు మారినప్పుడు పార్టీలు ముద్ర వేసి ముందు పని చేసిన వారిని తొలగిస్తున్నారు. తరువాత కొత్త వారిని నియమించు కుంటున్నారు. పార్టీ ముద్రలు వేసి, రాజకీయ రంగు పులిమి తొలగించిన వారికి ఆప్కాస్ లో ఉండటం కారణంగా వారికి ఏ విధమైన ప్రభుత్వ పథకాలు దరి చేరడం లేదు. ప్రభుత్వాలు ఉద్యోగుల ద్వారా పనులు చేయించుకునేటప్పుడు వారికి కనీస అవసరాలు అయిన ఆరోగ్య రక్ష వంటి పథకాలను తక్షణమే వారికి వారి కుటుంబ సభ్యులకు అందే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు చిరుద్యోగులు కోరుతున్నారు.

మొక్కులు వెంకటేశ్వరునివి.... ముడుపులు దశరధునివి

ఉద్యోగం అవుట్‌సోర్సింగ్ కానీ కలెక్షన్‌లు మాత్రం అవుట్ ఆఫ్ సోర్స్



విశాలాంధ్ర - సరుబుజ్జిలి : శ్రీకాకుళం జిల్లాలో ఆర్ అండ్ బి అధికారి అనగానే గుర్తుకు వచ్చే పేరు బెండి దశరధుడు. ఉద్యోగం అవుట్‌సోర్సింగ్ కానీ కలెక్షన్ లు మాత్రం అవుట్ ఆఫ్ సోర్స్. దేవుడు దయవున్నా పూజారి ప్రసాదం పెట్టకపోతే ఎం చేస్తాం.... పేపర్లు సక్రమంగా ఉన్నా పర్యవేక్షణ దారితప్పితే ఏమౌతుంది...? విషయానికి వస్తే సరుబుజ్జిలి మండలంలో నాలుగు రోడ్ల కూడలి అభివృద్ధి పనులులో కాంట్రాక్టర్ లాభాలు అర్జిస్తారో లేదో కానీ...! దశరథుడు మాత్రం తగ్గేదేలే. దశరథుని పర్యవేక్షణలో రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో ముడుపులిస్తే ఒకలా, లేకుంటే మరోలా నిర్మాణ పనులు జరుగుతున్నాయని కొందరు స్థానికలు వాపోతున్నారు. పాలకొండ రోడ్డులో వంశధార ఎడమ కాలువ వైపు నుండి శిమ్మ కోనేరు వరకు నడిచిన రోడ్డు పనులు ఒక్కసారిగా అడుగు రోడ్డు లోపలికి జరిగింది. అయితే ఇలా ఎందుకు జరిగింది అని స్థానికులు అడిగితే కొందరికి సమాధానం చెప్పడం లేదని, మరికొందరికి ఆర్ అండ్ బి అధికారి ఆంజినేయులును అడగమని చెప్తున్నారని తెలుపుతున్నారు. ఇక్కడ మధ్యవర్తి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పనులు పర్యవేక్షణకు వస్తాడని, పదివేలు కడితే పది అంగుళాలు ముందుకు త్రొక్కుతా లేకుంటే వెనుక్కే అంటూ తన మధ్యవర్తులతో బెదిరిస్తాడని పలువురు వాక్యాణించారు. అలికాామ్ బత్తిలి రోడ్డులో హిరమండలం వైపు ఆర్ అండ్ బి స్థలాన్ని తన స్నేహితునికి దార దత్తం చెయ్యటానికి మొరో వైపు ఉన్న జిరాతి స్థలాలపై పడుతున్నారని పలువురు తెలుపుతున్నారు. సరుబుజ్జిలి అభివృద్ధి పనులపై ఏ.ఈ.ఈ. ఆంజనేయ నాయక్ దృష్టి సారించాలని, లేని పక్షంలో రోడ్డు పాల కడలిలో అమృత మధనం తరువాత సోమ్మశిల్లిన శేష నాగులా రోడ్డు ఒంకరులు తిరుగుతూ పోతుందని పలువురు వ్యాఖ్యనిస్తున్నారు. ఏ.ఈ.ఈ. నాయక్ నిజా, నిజాలు ఏంటనే విషయం అవగాహన చేసుకొని బాధితలు తెలుపుతున్న వివరాలలో వాస్తవాలు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

విశాలాంధ్ర
శ్రీకాకుళం
పేజీ : 3
సోమవారం 27, అక్టోబర్, 2025

తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : మంథా తుఫాన్ నేపథ్యంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం. చిన్నంనాయుడు బుధవారం కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. అక్కడి మత్స్యకారులను కలిసి ఎవ్వరు వేటకు వెళ్ళరాదని, రెండు రోజుల్లో తుఫాన్ తీవ్రత పెరుగుతుందనే వాతావరణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిత్యవసరాలను అందుబాటులో ఉంచుకోవాలని, ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్ళిన మత్స్యకారుల వివరాలను తమకు తెలిపి, వారిని తిరిగి రావాల్సిందిగా సమాచారం ఇవ్వాలని అన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రధాన రహదారిపై గోతులు

- అధికారుల నిర్వాహకంతో ప్రజాధనం వృధా

- ఆరు చోట్ల మార్చిన వాల్వులు - లీకేజీలు అరికట్టేనా

విశాలాంధ్ర - ఆమదాలవలస : తాగునీటి సరఫరా లో ఏర్పడుతున్న అంతరాయాలను సరి చేసేందుకు ప్రధాన రహదారిపై గోతులు తవ్వి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. కొన్నిచోట్ల వాల్వులను మార్పు చేసినప్పటికీ లీకేజీలు అరికట్టుకుంటే దాంట్రాసి మెట్ట వద్ద వున్న ఓవర్ హెడ్ ట్యాంకు పూర్తిస్థాయి నీటి నిల్వాలు కష్టతరమవుతాయి. అంతేకాకుండా దిగువ ప్రాంతాల్లో తాగునీటి కుళాయిలకు ఉన్న మోటార్లను తొలగించుకుంటే ఇదే పరిస్థితి ఏర్పడుతుందని తెలుస్తుంది. తాగునీటి సరఫరాలో అంతరాయాలను సరిదిద్దేందుకు పైపు లైనుల వాల్వులు ఉన్న ప్రాంతాన్ని తవ్వి వాటిని సరి చేసే సమయంలో కొన్ని అంతరాయాలు ఎదురవుతున్నాయి. వీటికి శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపించడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారనే చెప్పాలి. ఒక తప్పును సరిదిద్దేందుకు తప్పుల మీద తప్పులు చేయాల్సి వస్తుంది. సమితుల కాలంనాటి పైపులైను కావడంతో ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో కొత్త పైపులైనుకు ప్రణాళిక రూపొందించాల్సిన అధికారులు తాత్కాలిక పనులతోనే సరిపెడుతున్నారు. ఒక ఏడాదిలో మరమ్మతులకు చేసే ఖర్చు ఆముదాలవలస చుట్టూరా వార్డులకు కొత్త పైపులైను వేయవచ్చు. అంటే ప్రజాధనం ఎంత దుబారా అవుతుందో అంచనా వేసుకోవచ్చు. ప్రధాన రహదారి మార్గంలో ఉన్న వాల్వులు సరి చేసేందుకు గోతులు తవ్వేస్తున్నారు. వాటి మరమ్మతులు చేసేందుకు కనీసం మూడు

నాలుగు రోజులు పడుతుంది. దీంతో ఆ ప్రాంతాల్లో వాహనదారులకు ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది. వాల్వుల ప్రాంతంలో లీకేజీలు ఎక్కువ కావడంతో దిగువ ప్రాంతానికి నీరు కిందికి రాకపోవడానికి గల కారణాలను అధికారులకు తెలిసినప్పటికీ గోతులు తవ్వి వాల్వులను సరి చేసే పనిని పెట్టుకున్నారు. దీంతో వాల్వులను మార్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. సమీక్షలు నిర్వహించే ఉన్నతాధికారులు తాగునీటి సరఫరా కయ్యే ఖర్చులను లెక్కించి లెక్కలు సరి చేసుకుంటున్నారే తప్ప మూలాలను సరి చేసే పనిలో ఏ ఒక్కరూ చొరవ చూపటం లేదన్న విమర్శలు ఉన్నాయి. పురాతన పైపులైను కావడంతో నిత్యం మొరయిస్తున్నాయని వాటి మరమ్మతులకు ఖర్చు చేయాల్సి వస్తుందని అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. పట్టణ ప్రజలకు సరిపడా తాగునీరు అందించడంలో విఫలమైన అధికారులు పైపులైన్లు పేరుతో వేలకవేలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల నిర్వాకంతో ప్రజాధనం వృధా...

అధికారులు వ్యవహార శైలి కారణంగా పైపులైన్ల మరమ్మతుల సమయంలో ప్రజాధనం వృధా అవుతుందని విమర్శలు ఉన్నాయి. పైపులైన్లకు ఉన్న మోటార్లను తొలగించకుంటే పరిస్థితులు ఇలాగే ఉంటాయి. అలాకాని పక్షంలో మొత్తం నూతన పైపుతో ఎలక్షన్ చేయాలని లేకుంటే మరమ్మత్తులకే మున్సిపాలిటీ ధనం వృధా అవుతుంది. అధికారులకు పైప్ లైన్ లీకేజీలు మూలాలు తెలిసినప్పటికీ వాల్వుల దగ్గర మాత్రమే పనులు చేస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు కు గురి చేస్తున్నారు. అధికారులు పాలకులు సమన్వయంతో వ్యవహరించి తాగునీటి సరఫరాకు ప్రతిష్ట ప్రణాళికల రూపొందించి ప్రజల మన్నలను పొందాల్సి ఉంది.

ఐదు చోట్ల మార్చిన వాల్వులు...

పట్టణంలోని తాగునీటి సరఫరా పైపులకు వద్ద దిగువ కు నీటిని విడిచి పెట్టేందుకు ఉన్న వాల్వులు ను లక్ష్మీ నగర్ వీధి వద్ద ఒకటి, ప్రధాన రహదారి వాణిజ్య ఉదయం వద్ద, మెట్టక్కి వలస, దాండరాసి మెట్ట వద్ద రెండు వాల్వులను ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటు ద్వారా పైపులైను లీకేజీలు నిర్మూలన జరిగేనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. లీకేజీలు నిర్మూలన జరిగితే ట్యాంకు ఫుల్ అయ్యేందుకు కొంత సమయం తగ్గుతుంది. మరికొన్ని చోట్ల ఉన్న లైన్లను మరమ్మతు చేసి పట్టణ ప్రజలకు తాగునీరు అందించాల్సి ఉంది. లీకేజీలను అరికట్టేందుకు పైపులైనుకు ఏర్పాటుచేసిన అక్రమ మోటర్లు ను తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రాజకీయ ప్రలోభాలకు లోనైతే వీటిని నిర్మూలన సాధ్యపడదు అన్న అనుమానాలు లేకపోలేదు. ఏది ఏమైనాప్పటికీ నాణ్యమైన తాగునీరును ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ప్రైవేటీకరణతో నష్టం : పేరాడ తిలక్

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణనతో నష్టం అని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. మండలం తాళ్ళవలస, వడ్డితాండ,కోటపాడు గ్రామాల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రభుత్వం ప్రవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్సిపి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని అదివారం చేపట్టారు. పిపిపి పేరుతో ప్రజలకు వైద్యం అందుబాటులోకి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు. వైద్యశాలలో ఆరోగ్యశ్రీ సేవలో పూర్తిగా నిలిపివేశారని అన్నారు. విద్య, వైద్యాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్ఆర్సిపి నాయకులను అక్రమ అరెస్టు చేయడంపై దృష్టి పెట్టిందని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం తూట్లు పొడవుడమే కాకుండా, హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన చంద్రబాబు హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు బి.మోహన్ రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు కోత సతీష్ ,నక్క భీమారావు, మార్పు నాగభూషణరావు, మార్పు ఆశోక్ చక్రవర్తి, కే.ఇందిర, కె.కృష్ణారావు, తదితరులు ఉన్నారు.